

కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారుడికి 'బీసీ బంధు' చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మృతుని కుటుంబాన్ని ఓదార్చుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

# సబ్బండ వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**● 'బీసీ బంధు' చెక్కుల పంపిణీలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

రామాయంపేట, అక్టోబర్ 1:తెలంగాణ రాష్ట్రంలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో రామాయంపేట మండలం తొనిగండ్లకి చెందిన 'బీసీ బంధు' లబ్ధిదారుడు మంగళి సాయికుమార్‌కు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా బీసీ బంధు రూ.1లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని, పేదల సంక్షేమానికి ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తుందన్నారు. ప్రతి ఇంటికి వివిధ సంక్షేమ పథకాలను చేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని, పేద ప్రజలకు ప్రయోజనం కలిగించే కార్యక్రమాలకు ప్రాముఖ్యతను కల్పిస్తున్నామన్నారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో అమలు జరగని సంక్షేమ పథకాలు ప్రస్తుతం సాగుతున్నాయన్నారు. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని ఈ ఆర్థిక సహకార పథకాలు కూడా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. దళారీల ప్రమేయం లేకుండా, డబ్బులు పొందేందుకు ఎవ్వరికీ లంచాలు చెల్లించాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తొనిగండ్ల బీఆర్ఎస్ నాయకులు పిట్ల బాలింగం, సిద్దరాములు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శలు.. ఆర్థిక సాయం

మెదక్ అర్బన్: మండలంలోని శివాయిపల్లికి చెందిన కోళ్ల మహేశ్ ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మెదక్ మండల రైతు బంధు అధ్యక్షుడు కృష్ణయ్య ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. అలాగే ఖాజీపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట రాయిన్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరస్వామి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



ముస్లిం మత గురువుతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే పద్మ

## ముస్లిం మత గురువును కలిసిన ఎమ్మెల్యే

మెదక్ అర్బన్, అక్టోబర్1: మెదక్ పట్టణంలోని ముస్లిం మత గురువు మౌలానా జావీద్ సాబ్‌ను ఆదివారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆప్యాయంగా పలుకరించి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## నేడు నిజాంపేటకు మంత్రి హరీశ్ రాక

నిజాంపేట, అక్టోబర్ 1: వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంను ప్రారంభించేందుకు సోమవారం (నేడు) నిజాంపేటకు రానున్నట్లు ఆదివారం బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు అబ్దుల్‌ఆజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు, నాయకులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నేడు అల్లాదుర్గంలో ఎమ్మెల్యే క్రాంతి పర్యటన

అల్లాదుర్గం, అక్టోబర్1: అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ నేడు (సోమవారం) మండలంలో పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నర్సింహులు ఆదివారం తెలిపారు. మండలంలోని ముస్లాపూర్‌లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించి, అనంతరం మహిళా మండలి భవన నిర్మాణానికి భూమి పూజ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

మనూరు, అక్టోబర్ 1: రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తూ నూతన రోడ్లను నిర్మిస్తుందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పుల్‌కుర్తి గ్రామం వద్ద 161బి జాతీయ రహదారి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ నుంచి బీదర్ వరకు 46కి.మీటర్లకు రూ. 513కోట్లు మంజూరు అయ్యాయన్నారు. రోడ్డు నిర్మాణంతో బీదర్ వెళ్లేందుకు ఇబ్బందులు తీరనున్నాయన్నారు. గతంలో ఈ ప్రాంతం నుంచి వాహనదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని నూతన రోడ్డు నిర్మాణంతో రోడ్డు వెంబడి ఉన్న గ్రామాలన్నీ అభివృద్ధికి నోచుకున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విఠల్‌రావు, ఎంపీటీసీలు అంబారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు నాగప్ప, శివాజీరావు, నాయకులు రవిందర్‌నాయక్, నాగేందర్, శివశంకర్ పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ

జహీరాబాద్, అక్టోబర్ 1: జహీరాబాద్ పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలో ఈద్గా మైదానం నుంచి ప్రధాన రోడ్డు పై ముస్లిం యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈద్గా మైదానంలో ముస్లిం పెద్దలు సామూహిక వివాహాలు జరిపించారు. వేడుకల్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త దేవీప్రసాద్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తన్వీర్ తదితరులు ఉన్నారు.



చీపురుతో శ్రమదానం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, సీడీపీవో స్వరూపరాణి

# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

మెదక్ రూరల్/రేగోడ్/అల్లాదుర్గం, అక్టోబర్ 1: పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో పలు గ్రామాల్లో సర్పంచులు, సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్ సీడీపీవో స్వరూపరాణి శ్రమదానం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సఖీ సిబ్బంది ఉన్నారు.



పోస్టాఫీసు వద్ద చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

**రేగోడ్‌లో 'స్వచ్ఛతా హీ సేవా'**

ఆర్‌బీఐ, ఎస్‌బీఐ, ఏపీజీవీబీ బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం రేగోడ్ పోస్టాఫీసు వద్ద 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహించి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్సింహులు, పంచాయతీ సెక్రటరి, ఏపీజీవీబీ మేనేజర్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు, విద్యుత్, విద్యా శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు..**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛతా హీ సేవా'కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రమదానం నిర్వహించి చెత్తను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, తద్వారా అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని చేవెళ్ల గ్రామంలో దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్ సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి, వార్డు సభ్యులు, గ్రామస్తులతో కలిసి చీపురుతో రోడ్లను ఊడ్చారు.



చేవెళ్లలో శ్రమదానం చేస్తున్న సర్పంచ్, పంచాయతీ సిబ్బంది



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎంపీడీవో

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కల్హేర్, అక్టోబర్ 1: కల్హేర్‌లోని ప్రభుత్వ కార్యాలయ సముదాయాలకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమైనట్లు ఎంపీడీవో సంగ్రామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, మండల వనరుల కేంద్రం, వెలుగు కార్యాయలయం, రైతు వేదిక, మండల ప్రజాపరిషత్ కార్యాలయాలకు వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ. 2.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ మేరకు కల్హేర్, పిట్లం వెళ్లే దారి నుంచి తహసీల్ కార్యాలయం వరకు 60మీటర్లు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంగప్ప, ఉప సర్పంచ్ సాయిలు, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి కృష్ణహరి ఉన్నారు.

## జహీరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

జహీరాబాద్, అక్టోబర్ 1: పట్టణంలోని బైపాస్ రోడ్డులో ప్రమాదం జరిగి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో డీసీఎం, కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కర్ణాటక వైపు నుంచి డీసీఎం వస్తుండగా అదే రోడ్డుపై వెనుక నుంచి కారు వస్తుండగా, కారు వెనుక ఉన్న లారీ అతివేగంతో వచ్చి కారును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కారును లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిం ది. కారులో ఇద్దరు మహిళలు, డ్రైవరు, యువకుడు ఉన్నారు. గాయాలు కావడంతో జహీరాబాద్ ఏరియా దవాఖానకు తరలించారు.